నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ శనివారం 15 ఫిబ్రవరి 2025 | ADILABAD NIRMAL




నేరడిగొండలో మొక్కనాటి సెల్ఫీ దిగుతున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

# 'రైతు బంధు'వుకు పుష్పాభిషేకం

**ముక్రా(కే)లో ముందస్తుగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు**

ఇచ్చోడ, ఫిబ్రవరి 14 : రైతు బంధువు, మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పంట పొలాల్లో పుష్పాభిషేకం చేస్తూ శుక్రవారం ముక్రా(కే)లో గ్రామస్తులు, రైతులు ముందస్తుగా ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. మళ్లీ పల్లెల్లో సంక్షేమ పథకాలు అందాలంటే 'కేసీఆర్ సారే రావాలి మళ్లీ కారే కావాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మళ్లీ రైతు రాజు కావాలంటే, మళ్లీ తెలంగాణకు కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని కొనియాడారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ బాజా భజంత్రీలు డప్పులు వాయిస్తూ పంట పొలాల్లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గాడ్గే మీనాక్షి, గాడ్గే సుభాష్, తిరుపతి, ప్రహ్లాద్, దత్త, శ్రీరామ్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటి సెల్ఫీ దిగిన ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి 14 : తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటి సెల్ఫీ దిగి శుభాకాంక్షలు తెలిపారు. వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ 'మొక్కలు నాటి సెల్ఫీ దిగండి' అని ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 17 నియోజకవర్గంలో ప్రతి నాయకుడూ మూడు మొక్కలు నాటి ముందస్తు శుభాకాంక్షలు తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాథోడ్ సురేందర్, నారాయణ, ప్రతాప్‌సింగ్, నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

**- మాజీ మంత్రి జోగు రామన్న**

ఎదులాపురం, ఫిబ్రవరి14: హరిత హారం పేరుతో తెలంగాణను ఆకుపచ్చగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సామాజిక కార్యక్రమంలో భాగంగా వృక్షార్చనలో భాగంగా శుక్రవారం మాజీ మంత్రి పార్టీ కార్యాలయంలో మూడు మొక్కలు నాటి వృక్షార్చన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఈ నెల 17న తెలంగాణ రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం ఉందని, ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ 3 మొక్కలు నాటాలని కార్యకర్తలు, అభిమానులకు సూచించారు. తన వంతుగా పార్టీ కార్యాలయంలో మూడు మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అజయ్, నారాయణ, సాజిదొద్దీన్, పండ్ల శ్రీను, మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్, దాసరి రమేశ్, ధమ్మపాల్, బుట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలో వృక్షార్చన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, నాయకులు




ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) గ్రామంలో మక్క చేనులో ముందస్తుగా కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న రైతులు, గ్రామస్తులు

# గిరిజనేతరుల ఆగడాలను అరికట్టాలి

**ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిడాం నంద కుమార్**

ఉట్నూర్, ఫిబ్రవరి 14 : జిల్లాలోని బేల మండల కేంద్రంలో గిరిజనేతరుల ఆగడాలను అరికట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సిడాం నందకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పీవో ఖుష్బూ గుప్తాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండల కేంద్రంలోని బురాన్‌పూర్ సర్వే 29/ఏ ఏజెన్సీ ఏరియాలోకి వస్తుందన్నారు. కాని రాథోడ్ బాపురావు 1/70 చట్టాలకు వ్యతిరేకంగా ప్లాట్లు వేసి క్రయ, విక్రయాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తాము 2021 నుంచి పోరాడుతున్నామని ఇప్పటికైనా పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేల సర్‌మేడీ సోనేరావు, రాణబాయి, రవీందర్, అరుణ్, నాగరాజు ఉన్నారు.

ఐటీడీఏ పీవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



బైంసా పట్టణంలో ప్రైవేట్ వ్యాపారికి కందులు విక్రయిస్తున్న రైతులు



# కందులు కొన్నది సున్నా

**ఎకరాకు 3.30 క్వింటాళ్లు..అది కూడా ఆన్‌లైన్‌లో పేర్లుంటేనే కొంటామంటున్న మార్క్‌ఫెడ్**

- **అధికారుల ఆంక్షలతో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్న అన్నదాతలు**
- **క్వింటాలుకు రూ.400 నష్టపోతున్న రైతన్నలు**

నిర్మల్, ఫిబ్రవరి 14(నమస్తే తెలంగాణ): జిల్లాలో కంది రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం విధించిన ఆంక్షలకు తోడు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ సిబ్బంది చేసిన నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొన్నది. వానకాలం సీజన్‌లో జిల్లాలోని పలు మండలాల్లో రైతులు కంది పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో ఆశించిన దిగుబడులు వచ్చాయి. అయితే ఆ ఆనందం రైతుల్లో కనిపించడం లేదు. జిల్లాలో కందులు ఎక్కువగా పండించే ప్రాంతాలైన సారంగాపూర్, నిర్మల్, బైంసా, కుభీర్, తానూర్, ముథోల్ తదితర మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 15 రోజుల క్రితమే కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఎకరానికి 3.30 క్వింటాళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు రాగా, 3 క్వింటాళ్లు మాత్రమే ప్రభుత్వం కొంటామని చెప్పడంతో మిగతా పంటను ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు వ్యవసాయ శాఖ సిబ్బంది సాగు చేసిన పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవడంతో కంది పంట వేసిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. జాబితాలో పేర్లు లేని రైతుల పంటను మొత్తానికే కొనడం లేదు. ఇన్ని ఆంక్షల మధ్య చేసేదేమీలేక తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి కంది రైతులు నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 17,529 మంది రైతులు 9,693 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారని అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కాని ఈ నమోదు ప్రక్రియ పూర్తిగా తప్పుల తడకగా ఉన్నదని రైతులు మండిపడుతున్నారు. వాస్తవానికి జిల్లా వ్యాప్తంగా దాదాపు 15వేల ఎకరాలకు పైగా కందిపంట సాగైందని రైతులు చెబుతున్నారు. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారుల లెక్కల ప్రకారం 9,185 ఎకరాల్లో కందిపంట సాగైనట్లు చెబుతున్నారు. ఈ లెక్కన 3,147 మెట్రిక్ టన్నుల కందుల కొనుగోళ్లు లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు 6 చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా సెంటర్ల ద్వారా క్వింటాలుకు రూ.7,550ల మద్దతు ధరతో కొనుగోళ్లు చేపడుతున్నప్పటికీ, అధికారులు పెట్టిన అనేక కొర్రీల కారణంగా రైతులు తమ పంటను అమ్ముకునేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు ఆయా సెంటర్లలో ఒక్క గింజను కూడా కొనుగోలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. అధికారుల నిర్వాకం కారణంగా రైతుల కష్టాన్ని ప్రైవేట్ వ్యాపారులు అందినకాడికి దండుకుంటున్నారు.

### క్వింటాలుకు రూ.300 నుంచి 400 నష్టం...

అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ ఆంక్షల కారణంగా జిల్లాలోని కంది రైతులకు నష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్లలో కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.7,550 ఉన్నది.ఆయా సెంటర్లలో 12శాతం లోపు తేమ ఉంటేనే కంది పంటను కొనుగోలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో పంట నమోదు లేకపోవడం లాంటి ఇబ్బందులతో చాలామంది రైతులు దళారులనే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేట్ వ్యాపారులు క్వింటాలుకు రూ.7,100 నుంచి 7,300 వరకు ఇష్టారీతిన ధరలు నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు క్వింటాలుకు రూ.300 నుంచి 400వరకు నష్టపోతున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న కుభీర్, తానూర్ మండలాలకు చెందిన కొందరు రైతులు ధర్మాబాద్ పట్టణంలో గల వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇక్కడితో పోలిస్తే మహారాష్ట్రలో ధర కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో ధర తక్కువ అయినా సరే ఇక్కడే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు.

### ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు..



*3 ఎకరాల వ్యవసాయ భూమిలో అంతరపంటగా కంది సాగు చేసిన. 6 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్‌లో అమ్ముదామని వెళ్లగా, నా భూమిలో కందిపంట సాగైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. పంట నమోదైతేనే కొంటామని చెప్పిన్రు. చేసేదేమీ లేక మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు తీసుకుపోయి క్వింటాలుకు రూ.7,200లకు అమ్మేసిన. సొసైటీల రూ. 7550 ధర ఉన్నది. కందిపంట వేసినప్పుడు మా దగ్గరికి వ్యవసాయ శాఖ అధికారులు ఎవరూ రాలేదు. ఆఫీసర్లు చేసిన తప్పుకు క్వింటాలుకు రూ.350 నష్టపోయిన.*

***-బాలాజీ, కంది రైతు, సింగన్‌గావ్, తానూర్ మండలం***



తానూర్ మండల కేంద్రంలో కొనుగోళ్లు లేక వెలవెలబోతున్న మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం

# హోరాహోరీగా కుస్తీ పోటీలు




కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

ముథోల్, ఫిబ్రవరి 14 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాతో పాటు మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి మల్లయోధులు వచ్చి పాల్గొన్నారు. మొదటి బహుమతిగా రూ. 10 వేలతో పాటు 50 తులాల కడియం, రెండవ బహుమతిగా రూ.5 వేలను విజేతలకు అందజేశారు. జాతరలో సీఐ మల్లేశ్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- **బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**
- **బీఆర్‌ఎస్‌లో చేరిన గుబ్బ గ్రామస్తులు**

ఇచ్చోడ, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు కాంగ్రెస్ విఫలమైందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుబ్బ గ్రామస్తులు మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి వారిని పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అభివృద్ధి చేసే సత్తా ఉన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను చూసి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. కేసీఆర్ సంక్షేమ పథకాలే తెలంగాణకు శ్రీరామ రక్షగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. మరింత అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. గిరిజన తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా తెలుపాలని, 24 గంటలు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, విజయ్ రెడ్డి, గణేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నిర్మల్‌లో డివైడర్లలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి, 14: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నిర్మల్‌లోని కలెక్టరేట్ చౌరస్తా రహదారి డివైడర్ మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు. విద్యార్థులంతా పాఠశాల స్థాయి నుంచే పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కలెక్టర్ అన్నారు. పారిశుధ్యం, మొక్కల పెంపకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో పీ రామారావు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌రెడ్డిగౌడ్, డీఈ హరిభువన్, అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకం

ఎదులాపురం, ఫిబ్రవరి 14 : స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ, విధుల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు పాత్ర కీలకంగా ఉంటుందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు-2025 రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాస్టార్ ట్రైనర్లు ప్రొజెక్టర్ ద్వారా ఎన్నికల నిర్వహణ, విధులు, ఫారం నమోదు చేసే విధానంతో పాటు ఏజెంట్ల నియామకం, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో స్టేజ్ వన్, స్టేజ్ టూ అధికారుల పాత్ర ఎంతో ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి శిక్షణ పూర్తి చేసుకొని నిర్వహణకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఆర్వోతో పాటు నోడల్ అధికారులకు వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, ఆర్వోలు, ఏఆర్వోలు పాల్గొన్నారు.

### స్టేట్ టీమ్‌తో జిల్లా కలెక్టర్ సమావేశం

పైలెట్ ప్రజావాణి, ప్రజా ఫిర్యాదుల బహిరంగ విచారణ కార్యక్రమంపై స్టేట్ టీమ్‌తో కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో మొదటగా ఆదిలాబాద్ జిల్లాలో జనవరి 27 నుంచి ప్రారంభించిన ఇన్ఫర్మేషన్ ఫెసిలిటీ సెంటర్ (సమాచార, సహాయ కేంద్రం ఐఎఫ్‌సీ) ద్వారా ప్రజావాణి కార్యక్రమంలో అర్జిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. స్టేట్ టీమ్ రాజస్థాన్, జార్ఖండ్, బెంగుళూర్, హైదరాబాద్, యాదాద్రి భువనగిరి, వికారాబాద్ , తదితర ప్రాంతాల నుంచి కిసాన్ మిత్ర, సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్ మెంట్, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్రీ, డిజిటల్ ఎంపవర్ ఫౌండేషన్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్, రైతు స్వరాజ్ వేదిక, సఫర్ ఇతర పౌర సమాజ సంస్థల నుంచి 60 మందికి పైగా ఆదిలాబాద్‌కు వచ్చి సహకారం అందించారని తెలిపారు. కిసాన్ మిత్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ హర్ష , కిసాన్ మిత్ర టీమ్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా